ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల

విశాలాంధ్ర - ఆలమూరు : రైతుల వద్ద నుండి ప్రతి ధాన్యపు గింజలు కొనుగోలు చేస్తామని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల అన్నారు. ఆలమూరు మండలం పినపల్ల పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆర్బికేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తపేట ఆర్డిఓ ముక్కంటి, గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ క్రాఫ్ నమోదు చేసుకొని ఈ కేవైసీ పూర్తి అయిన రైతులు తమ ధాన్యం విక్రయించుటకు సిద్ధమైన రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం తులసి, డిసిఓ ఏ రాధాకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకుల జేడి వై అనంత కుమారి, వ్యవసాయ శాఖ ఏడిఎం విశాలాక్షి, అమలాపురం డిటిఓ అశోక్ ప్రతాప్ రావు, తహసీల్దార్ జి. లక్ష్మీపతి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నివారణకే నూతన ప్రక్రియ

కలెక్టర్ కె.మాధవీలత

విశాలాంధ్ర - అనపర్తి : ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థను పూర్తిగా నివారించడానికే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో నూతన ప్రక్రియ ప్రారంభించిందని దీంతో కొనుగోలులో కొద్దిగా ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమేనని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవి లత అన్నారు. బుధవారం మహేంద్రవాడ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ మాధవి లత, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు సమస్యలన్నింటిని అధిగమించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లామని, వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి రైతు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారని చెప్పారు. తదనుగుణంగా మంగళవారం పౌరసరఫరాల కమిషనర్ అరుణ్ కుమార్, బుధవారం జిల్లా కలెక్టర్ మాధవి లత వచ్చారని ఎమ్మెల్యే సత్తి చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, ఆర్డీవో చైత్ర వర్షిణి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న అమలాపురానికి మంత్రి విశ్వరూప్

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ ముంబైలో జరిగిన గుండె ఆపరేషన్ విజయవంతమైన అనంతరం హైదరాబాదులో విశ్రాంతి తీసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఈ నెల 11వతేదీ ఉదయం 11 గంటలకు విమానంలో రాజమండ్రి, మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా అమలాపురం చేరుకుని అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారని వైఎస్ఆర్ సిపి యువనాయకుడు పినిపే శ్రీకాంత్ తెలిపారు.

నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - రౌతులపూడి : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతుల పూడి మండలంలోని ఎస్ పైడిపాల గ్రామంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభించి, తరువాత రాఘవపట్నం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించి, అనంతరం సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ఎంపీడీవో గోవింద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, జెడ్పీటీసీ గొల్ల చిన్న దివానం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. గిరిజన కుటుంబాలకు అటవీ హక్కుదారులకు డి పట్టా, పాస్ బుక్‌లు, కుల ధ్రువీకరణ పత్రాలను కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీతా విశ్వనాథ్, ప్రత్తిపాడు శాసనసభ్యులు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి, మండల కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జొన్నకూటి మణమ్మ అన్నారు. గ్రామ పంచాయతీ వద్ద వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులకు దూరంగా ఉండే గ్రామాల్లో ప్రజల అనారోగ్య సమస్యలను తగ్గించేందుకు వైద్యులు, సిబ్బంది ప్రజలకు చేరువలో ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి చెకప్ లు, రక్త పరీక్షలు, బిపి, సుగర్ మందులు అందించడం ఆనందదాయకమని అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. వైద్యులు సి.హెచ్.సి ఎం. సౌమ్య చైతన్య రాజు వైద్యులు.. ఎ. డేవిడ్ రాజు, సచివాలయం వద్ద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వద్దులు, గర్భిణులు, పిల్లలు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు జొన్నకూటి శ్రీనివాస్, కార్యదర్శి రాఘవ రెడ్డి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, 104 సిబ్బంది వై.నాగబాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిత్య అన్నదానం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్య క్షులు జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి సూర్యచంద్ర, అమెరికా నుండి పైడా శ్రీరామ్, పైడా వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన వంటశాలను ప్రారంభించారు. ఆలయ పురోహితులు చంద్రమౌళి సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉప్పలపాడు శివాలయంలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహించే వారని, దాతల సహకారంతో ప్రతిరోజు అన్నదానం నిర్వహించడం చాలా గొప్ప కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, చలగళ్ళ దొరబాబు,కుంచే రాజా, అడబాల ఆంజనేయులు, తోట రవి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదానం ప్రారంభ రోజు కావడంతో బుధవారం 3,000 మందికి అన్నదానం నిర్వహించారు.

ఫాదర్ ప్రసాద్‌బాబుకు సన్మానం

విశాలాంధ్ర - గోపాలపురం : పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసింది తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు అని గోపాల పురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం మండలంలోని వేళ్ళ చింతల గూడెం గ్రామంలో రోమన్ క్యాథలిక్ ప్రార్థన మందిరాన్ని సందర్శించి ఫాదర్. బి విజయ్ ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ విజయ్ ప్రసాద్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు శాలువాతో, పుష్పగుచ్ఛంతో సత్కరించి గౌరవిం చారు.

గ్రంథాలయ మహోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-చాగల్లు: జాతీయ గ్రంథాలయ మహోత్సవాల గోడ పత్రికను చాగల్లు మండల ఎంపీపీ మట్టా వీరస్వామి, మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. రాంప్రసాద్, బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల ద్వారా జ్ఞాన సముపార్జన పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్ర వరం, చాగల్లు, గ్రంథాలయ అధికారులు గద్దె శ్రీనివాసరావు, కె.సుమన్ కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - దేవరపల్లి : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం శాసన సభ్యులు తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలో బుధవారం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతులకు గోనె సంచులు, వాహన, కూలి చార్జీలు ఇస్తారన్నారు. ముందుగా ఎమ్మెల్యే ఎంపీపీ కేవీకే దుర్గారావు ధాన్యం కొలిచే పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, ఎంపీడీవో కె. ఉమామహేశ్వర శర్మ, తహసీల్దార్ రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి కవిత, ఎంపీటీసీలు పి రామలక్ష్మి, వైసిపి నేతలు పచ్చ రాంగోపాల్, మాధవరం వెంకటేశ్వరరావు, గంగాధర్ సొసైటీ ఉద్యోగులు పి.రాధాకృష్ణ, జి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళారీల నిర్మూలనకు ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - గోకవరం : గ్రామీణ ప్రాంతాలలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం మండలంలోని శ్రీ వేణుగోపాల కామరాజుపేట సొసైటీ పరిధిలోగల కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చంటిబాబు బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజుల లోపు వారి వారి ఖాతాలలో డబ్బులు నేరుగా జమ చేస్తారని అన్నారు. ఒకవేళ రైతే గోనె సంచులు, హమాలీలు రవాణా ఖర్చులు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ డబ్బులు కూడా నేరుగా రైతు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా 21 రోజులలో చెల్లించబడతాయని ఎమ్మెల్యే చంటిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనపరెడ్డి సుబ్బారావు, కామరాజుపేట సొసైటీ అధ్యక్షుడు పి. సతీష్ కుమార్, సొసైటీ సీఈవో కామిశెట్టి వీరభద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు పాల్గొన్నారు.

వ్యర్థ జలాల శుద్ధికి చర్యలు

కార్పొరేషన్ కమిషనర్ రమేష్

విశాలాంధ్ర - కాకినాడ : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు వ్యర్థ జలాలను శుద్ధిచేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ చెప్పారు. బుధవారం ఆయన దుమ్ములపేట, శారదాదేవి ఆలయ ప్రాంతాలలో మురికి నీటిని శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించారు. డ్రైనేజీ నీటిలోని ప్రమాదకర, హానికర వ్యర్థాల తీవ్రతను తగ్గించేందుకు రసాయనాలతో శుద్ధి చేస్తున్నామన్నారు. బయో రెమిడేషన్ ప్రక్రియ ద్వారా కాకినాడలోని రెవెన్యూ కాలనీ, చీడిలపొర దుమ్ములపేట, ప్రాంతాలలో వ్యర్థ జలాల శుద్ధి ప్రక్రియ జరుగుతుందన్నారు. అలాగే తడి-పొడి చెత్తను కూడా ప్రాసెసింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. ఇందులో భాగంగా తడి చెత్త నుంచి సిఎన్‌జి గ్యాస్‌ను ఉత్పత్తి చేసే బయోమెథనేషన్ ప్లాంట్ చొల్లంగి వద్ద సిద్ధమవుతోందన్నారు. పొడి చెత్తను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తున్నామన్నారు. ఇవన్నీ పూర్తిస్థాయిలో అమలు జరిగితే చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

పూడికతీత పనులకు అధునాతన పరికరం

- రూ.40 లక్షలతో ఓఎన్‌జిసి కొనుగోలు
- కమిషనర్‌కు అందజేత

విశాలాంధ్ర - కాకినాడ : పూడిక తీత పనులు మరింత సమర్థ వంతంగా నిర్వహించేందుకు ఓఎన్‌జిసి సంస్థ అధునాతన పరికరాన్ని సమకూర్చింది. రూ.40 లక్షల సిఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన రోబోటిక్ స్కావెంజింగ్ మిషన్‌ను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశ్ కుమార్ బుధవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఓఎన్జిసి ఈడి ఆదేశ్ కుమార్ మాట్లాడుతూ సంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా దేశవ్యాప్తంగా 12 రోబోటిక్ స్కావెంజింగ్ మిషన్లు సమకూర్చామన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ మాట్లాడుతూ మ్యాన్ హెూల్స్, అండర్ గ్రౌండ్ డ్రైన్‌లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఓఎన్‌జిసి సంస్థ గతంలో కూడా వివిధ సందర్భాలలో ఇదే తరహాలో ఎంతో తోడ్పాటు నిచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జిసి హెచ్ఆర్ మేనేజర్ డి మల్లిక్, డిఈ మాధవి, నగరపాలక సంస్థ, అధికారులు పాల్గొన్నారు.

న్యాయం పొందడం ప్రతి ఒక్కరి హక్కు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : న్యాయం అనేది పొందడం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది కాదని ప్రతి ఒక్కరి హక్కు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు పి వెంకట జ్యోతిర్మయి అన్నారు. బుధవారం న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ, రాజ మహేంద్రవరం నుంచి ర్యాలీ, అనంతరం అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు పి వెంకట జ్యోతిర్మయి మాట్లాడుతూ, ఈ న్యాయ సేవ చేసే బాధ్యతను జాతీయ న్యాయ సేవాధికార సంస్థ చట్టా ప్రకారం నల్సా పథకాన్ని ప్రవేశపెట్టి వాటి బాధ్యతను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలకు అప్పగించిందన్నారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. మున్సిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అత్యంత సమర్థవంతంగా న్యాయ సేవలు అందించే సంస్థల్లో రాజమండ్రి డిఎల్ఎస్ఏకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డిఎల్ఎస్ఏ కార్యదర్శి చొరవ స్ఫూర్తి నివ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి జీ నరసింహులు, ఎడిషనల్ ఎస్పీ రజనీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ శివ ప్రసాద్, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పలు స్కూల్స్, కాలేజీ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

విశాలాంధ్ర - కిర్లంపూడి : ఈనెల 11, 12, 13 తేదీల్లో ప్రకాశం జిల్లా ఈదరలో జరిగే రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల్లో జిల్లా జట్టు బాగా రాణించి విజయకేతనం ఎగురవేసి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఖో ఖో సంఘం వైస్ ప్రెసిడెంట్ చదలవాడ బాబి, ఉమ్మడి జిల్లా ఖో ఖో సంఘం కార్యదర్శి కె. పట్టాభిరామం, కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపిపి బొడ్డేటి గణపతి అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత వారం రోజులుగా యంగ్ మెన్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖోఖో శిక్షణా శిబిరం బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ శిక్షణలో బాగా రాణించిన 15 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్టుకు పూర్వ క్రీడాకారులు అందించిన క్రీడా దుస్తులను బాబి, పట్టాభి, పలువురు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆకుల శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ళ రామశివ, మాజీ చైర్మన్ దాడి గోవిందు, పూర్వ క్రీడాకారులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన

కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా..భోజనం, వసతి, చదువు పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు జిల్లాలోని హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం కాకినాడ, జగన్నాయకపురంలో సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం నూతన భవనానికి కలెక్టర్ కృతికా శుక్లా.. కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, స్థానిక ప్రజాప్రతినిధులు, రిలయన్స్ ప్రతినిధులు తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రూ. 40 లక్షల రిలయన్స్ నిధులతో 44 పడకలతో బాలికల వసతి గృహాన్ని నిర్మించి, ఆరు నెలల్లో విద్యార్థులకు అందుబాటులో తేనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్, శాసనసభ్యులు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి, కాకినాడ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ సిహెచ్ వెంకట సత్య ప్రసాద్, రిలయన్స్ ప్రతినిధులు టి.విశ్వనాథ్, పి.సుబ్రహ్మణ్యం, ఎస్‌వీఎన్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

పేదలకు అందుబాటులో న్యాయ సేవలు

విశాలాంధ్ర - తుని : అందరికీ న్యాయం జరగాలని, నిరుపేదలకూ కోర్టుల్లో న్యాయ సేవలందించాలని ఉద్దేశంతో 1987లో సుప్రీంకోర్టు లీగల్ సర్వీసు అథారిటీని యాక్ట్‌ను ప్రారంభించినట్టు మండల్ లీగల్ సర్వీసెస్ అథార్టీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. బాల కోటేశ్వరరావు అన్నారు. బుధవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ అథార్టీ చైర్మన్ బాల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత ఓర్గా మార్కా,సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వై సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ళ బదిరీ నారాయణ, న్యాయవాదులు సాకా సత్తిబాబు, వసంతల అప్పారావు, కృష్ణ శేఖర్, ఎస్ నాగేశ్వరరావు, తదితర న్యాయవాదులు పాల్గొన్న కార్యక్రమంలో న్యాయమూర్తి బాల కోటేశ్వరరావు ప్రసంగించారు. న్యాయ సేవలు పేదలకూ అందుబాటులో ఉన్నాయని, ప్లీడర్లను పెట్టుకునే స్తోమత లేని పేద కక్షిదారులు ఎవరైనా కోర్టు వారిని సంప్రదించినట్లయితే న్యాయ సేవలందించేందుకు గవర్నమెంట్ ప్లీడర్‌ను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వర్ణలత ఓర్గా మార్కా వై సత్యనారాయణ, న్యాయవాదులు మాట్లాడారు. న్యాయవాదులు కరుణశ్రీ, రమణ, పారా లీగల్ వాలంటీర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

దేశ భవితకు గురువే కీలకం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రపంచ దేశాలలో భారతదేశం అగ్రగామిగా నిలవాలన్నా, దేశం ఆర్థికంగా ఎదగలన్నా దేశ భవితకు గురువే కీలకమని తూర్పుగోదావరి జిల్లా అధ్య క్షులు, నియోజకవర్గ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. ప్రతి ఏటా విద్యారంగంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులు నియమించే అవార్డులకు రాజానగరం మండలం లోని శ్రీ రామపురం గ్రామంలోని డిఎంఆర్ ఎయిడెడ్ స్కూల్ ఉపాధ్యాయులు జీఎంవి రెడ్డి, పాత తుంగాపాడు హై స్కూల్ ఉపాధ్యాయులు కెవి రమణ రావు, నందరాడ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు ఎం. గంగయ్యదొర ఉత్తమ ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని శ్రీ రాజా కాండ్రేగుల జోగి జగన్నాథం పంతులు బహుద్దూర్ వారి అన్నదానం సత్రం లో బుధవారం జరిగిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఏ రంగం లోనైన ఆస్తులు సంపాదించుకోవచ్చు కానీ,సమాజంలో ఉపాధ్యాయులకు అందించే కీర్తిప్రతిష్టలు ముందు కోట్లు ఏపాటివని కొనియాడారు. 36 ఏళ్లుగా విద్యారంగంలో ఉపాధ్యాయులు జీఎంవి రెడ్డి అందించిన సేవలు హర్షణీయమన్నారు. దీనిలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే రాజా, ఎంపీపీ మందారపు సీతారత్నం వీర్రాజు, జడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న గ్రామస్తులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

మంత్రి రాజాకు హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగుల వినతిపత్రం



విశాలాంధ్ర - తుని : కాకినాడ జిల్లా తుని నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ పురుషులు రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసారు. నియోజకవర్గంలో తొండంగి, పెరుమాళ్ళపురం, కోటనందూరు, ఎన్ సూరవరం, తేటగుంట, ఏవి నగరం, రావికంపాడులలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు బుధవారం మంత్రి కార్యాలయంలో దాడిశెట్టిని కలిసారు. మంత్రిని కలిసిన వీరు తమ సమస్యల పట్ల వినతి పత్రాన్ని అందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని దాడిశెట్టి రాజాను కోరారు. మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్ళి న్యాయం చేసే లా కృషి చేస్తానని హెల్త్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

వైసీపీ పాలనలో విద్యకు పెద్దపీట

విశాలాంధ్ర - సామర్లకోట : మును పెన్నడూ లేని విధంగా వైయస్సార్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తూ పెద్దపీట వేసినట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్దా పురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు అన్నారు. సామర్ల కోట పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో "నాడు- నేడు" పథకం ఫేజ్ వన్ లో భాగంగా రూ. కోటి 55 లక్షల రూపాయలతో నిర్మించిన తరగతి గదుల భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమం, రెండో ఫేజ్ లో సుమారు రూ. 93 లక్షలతో చేపట్టే ఎనిమిది అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను బుధవారం ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, ఎంఈవో వై. శివరామ కృష్ణయ్య, పాఠశాల ప్రిన్సిపల్ హెచ్ఎం ఎస్ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

నాడు నేడు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-కూనవరం: కోతులగుట్ట కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం రెండవదశ నాడునేడు పథకం ద్వారా 52 లక్షల రూపాయల పనులకు బుధ వారం ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జ విజయ శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వం పాఠశాలల రూపు రేఖల్ని మార్చుతుందని అన్నారు. నాణ్యమైన ఉచిత విద్య ప్రతి విద్యార్థికి అందేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓఎస్ స్వరాజ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి పథకానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-చింతూరు : జల్ జీవన్ మిషన్ ద్వారా ఎర్రంపేట మంచినీటి ట్యాంక్ నుంచి చింతూరు శబరి ఒడ్డు, ఎస్టి కాలనీ, బీసీ కాలనీ, మెడికల్ కాలనీలకు,మంచినీటి సరఫరా చేసేందుకు సుమారు రూ.60 లక్షలతో పైప్ లైన్ పనులకు బుధవారం ఎంపీపీ అమల శంకు స్థాపన చేశారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నారావు, ఆర్ డబ్ల్యూయస్ ఏఈ, కోట్ల కృష్ణ , రాంప్రసాద్, సాయిబాబు, మడివి రాజు,వరలక్ష్మి,ఇల్లా మురళి, నాగేశ్వరావు తదతరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవోస్ డివిజన్ కార్యదర్శిగా ఆనంద్

విశాలాంధ్ర - మారేడుమిల్లి : అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలం రంపచోడవరం డివిజన్ ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కేపీ ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీవోల సంక్షేమానికి పాటు పడతానని అన్నారు. ఈ సందర్భంగా సహచరులు ఆయనను అభినందించారు.

ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని రూపొందించాలి

విశాలాంధ్ర-ఎటపాక : మండలంలోని పాత కొండే పల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివాసి టీచర్ అసోసియేషన్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆట ఎపి ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ హాజరై మాట్లాడుతూ ఆదివాసి టీచర్ల రాజ్యాంగపరమైన హక్కులు పరిష్కారం కోసం గిరిజనేతర సంఘాలతో కొట్లాడి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నేడు తమ ఏజెన్సీ టీచర్ల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించడంలో మన సంఘం ముందుండి పోరాటం చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ రంపచోడవరం పరిధిలో ఉన్నటువంటి ఉపాధ్యాయ ప్రమోషన్స్ స్థానిక ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలను పగడ్బందీగా అమలు చేసి ఆదివాసుల ఉనికిని, మనుగడను, సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నూపా అనిల్ , గౌరవ అధ్యక్షులు కనితి రామకృష్ణ ,శ్రీశైలం , శ్రీను ,మండల అధ్యక్షులు కాకరాజు, మండల ప్రధాన కార్యదర్శి పాయం ప్రసాద్. పూరి కిరణ్, ఆపక నాగేశ్వరావు, మహిళా అధ్యక్షురాలు గంగాభవాని, ప్రధాన కార్యదర్శి గురు సుహాసిని తుర్రం రజని పాల్గొని విజయవంతం చేశారు.

ప్రతిభా స్కాలర్ షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనకబడిన ప్రభుత్వ, ఇతర ఆర్థిక సహాయం లభించని జిల్లా విద్యార్థులకు తోడ్పాటును అందించాలన్న ఉద్దేశంతో ప్రతిభా ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్‌లను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి ఎండి ఇబ్రహీం ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడి ఎన్నారై చెక్కపల్లి రమేష్ ట్రస్టీగా 2012-13 సంవత్సరంలో ట్రస్ట్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ ట్రస్టు ద్వారా 2022-23 సంవత్సరం గాను ఐఐటి, మెడిసిన్, ఇంజనీరింగ్, ఎంసీఏలో ప్రవేశించుటకు నీట్‌లో పదివేల ర్యాంకు సాధించిన ఆర్థికంగా వెనకబడిన ఒక్కొక్క విద్యార్థిని ఎంపిక చేసి ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనాలు అందించనున్నట్టు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను వరుపుల చిట్టిబాబు, శ్రీ గణపతి వెంకట సాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఏలేశ్వరం అనే చిరునామాకు ఈ నెల 30 తేదీ లోగా పంపించాలని మరిన్ని వివరాలకు 7396526411, 9951367872 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని ఆయన కోరారు.

న్యాయ వారోత్సవాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : జాతీయ న్యాయ సేవ దినోత్సవంను పురస్కరించుకుని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు కోర్టు పరిధిలో సివిల్ కోర్ట్ జడ్జి కాటం భాను, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సత్వర న్యాయం లోక్ అదాలత్ లక్ష్యం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి భాను మాట్లాడుతూ న్యాయవాదులు, కక్షిదారులు ఒకే మాట మీదకి వచ్చి సత్వర న్యాయం పొందేలా సఖ్యత దిశగా కృషి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజాల చిట్టిబాబు, కోశాధికారి వెంకట్రావు, న్యాయవాదులు కాశీ ప్రసాదరావు, నరసింహారావు, హరిబాబు, జోగేశ్, మహిళా రీప్రజెంటేటివ్ దేవి, సుజన తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక నాడు-నేడు పనుల పరిశీలన

విశాలాంధ్ర - కరప : మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం సమగ్ర శిక్ష అభియాన్ ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు కరప మండలంలో జరుగుతున్న నాడు నేడు పనులు, జగనన్న విద్యా కానుక అదంటి కేసన్, మొదలగు వర్కులపై పరిశీలించినట్టు ఎంఈఓ బులి కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సిఆర్‌పిలు ప్రతి స్కూలును విజిట్ చేసి నాడు నేడు పనుల పురోగతిని విద్యార్థులు ప్రభుత్వం అందించే జగనన్న విద్యా కానుక అదెంటికేషన్ సక్రమంగా ఉండేటట్టు చూడాలని తెలిపారు. సీఆర్పీలు స్కూల్ విజిట్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వెంటనే నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - అమలాపురం : ఓటు త్వరగా నమోదు చేసుకోవాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు ఓటు హక్కుపై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్, కె. శ్రావణ్ దిలీప్, యాలంగి వరప్రసాద్, జాన్ పాల్, సంశోన్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి అఖిల భారత సహకార వారోత్సవాలు

విశాలాంధ్ర - భీమవరం : ఈనెల 14వ తేదీ నుండి 20 వరకు అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ఎం.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకొని ప్రతి సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సహకార జెండాను ఎగరవేసి సంఘ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సహకారవేత్తలు, రైతులు, మహిళలు, సంఘ సభ్యులతో రోజువారి కార్యక్రమాలకు అనుగుణంగా సమావేశపరిచి పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సహకార సిబ్బంది అందరూ కార్యక్రమాల్లో పాల్గొని వారోత్సవాలను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

అధిక కట్నం కోసం వేధించిన ముగ్గురికి జైలు శిక్ష

విశాలాంధ్ర-టి.నరసాపురం : అధిక కట్నం కోసం వేధించిన ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ కె. సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అప్పలరాజు గూడెం గ్రామానికి చెందిన గొబ్బిళ్ళ అపర్ణను భర్త సత్య రమేష్, అత్త సుబ్బలక్ష్మి, మరిది అజయ్ లు అధిక కట్నం కోసం వేధిస్తున్నారనే సంఘటన పై 2016 వ సంవత్సరంలో టి నరసాపురం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. చింతలపూడి కోర్టు న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ సాక్షులను విచారించి నేరం రుజువైనందున ముగ్గురు ముద్దాయిలకు ఒక్కొక్కరికి సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ కు ఎపిపి నమ్మయ్య,టి నరసాపురం ఎస్ఐ కె.సతీష్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ రాజు నిందితులకు శిక్ష పడడంలో సహకరించారు.

అల్లంచర్ల భూములను పరిరక్షించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : మండలంలోని అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలోని సర్వే నెంబరు 226లో గల భూములను పరిరక్షించాలని కోరుతూ మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళగిరి లోని టిడిపి ప్రధాన కార్యాలయం లో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చంనాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్తితులు, సభ్యత్వ నమోదు వంటి విషయాలను చర్చించినట్లు వారు తెలిపారు.సర్వే నెంబరు 226 భూములు అన్యాక్రాంతం కాకుండా పేదలకు దక్కేలా పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీ నారాయణ, వాసిరెడ్డి మోహన్ రావు, జోనుబోయిన సోంబాబు, సందేపూడి సాయి, గండబోయిన శ్రీను, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రంజక పాలన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : నిత్యం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలన చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వీ ఆర్.ఎలీజా అన్నారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డు రామచంద్రపురం కే.పి.రెడ్డి టవర్స్ నుండి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని,ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కన్వీనర్ ,రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి మండవల్లి సొంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,కమీషనర్ పి.భవానీ ప్రసాద్,పట్టణ వైసీపీ అధ్యక్షుడు పి.పి.ఎస్.చంద్రరావు,వైస్ చైర్మన్ లు ముప్పిడి అంజి,కంచర్ల వాసవీరత్నం,12వ వార్డు కౌన్సిలర్ షేక్ రహీమా, కౌన్సిలర్ లు తాతకుంట్ల వెంకట లక్ష్మి, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గా ప్రసాద్,ఎల్.వి.ఆర్.,చిటికెల అచ్యుత రామయ్య, మానవతా మూర్తి,దిర్సిపాము ధనలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు వెంపా ఐజాక్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది,వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర -భీమవరం : గెలుపోటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరుతేవాలని బ్రౌనింగ్ విద్యా సంస్థల చైర్మన్ మేడిది జాన్సన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం బ్రౌనింగ్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆరోగ్య భారత్ ను నిర్మించాలన్నారు. అనంతరం నిర్వహించిన నెట్ బాల్ ,రోప్ స్కిప్పింగ్ , షూటింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్, జిమ్నాసిక్స్, మాల్కంబ్ క్రీడల్లో 73 మంది క్రీడాకారులు జిల్లా జట్లకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ మేడిది ప్రియాంక జాన్సన్, వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, ప్రిన్సిపాల్ రంప ఎలిషా, ఉభయగోదావరి జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-19 కార్యదర్శులు కె.జయరాజ్, కుమార్, జిల్లా పిడి అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యం రాజా, రాష్ట్ర నెట్ బాల్ సంఘ వైస్ ప్రెసిడెంట్ ఎన్.విజయలక్ష్మి, రాష్ట్ర ఫెన్సింగ్ సెక్రటరీ కృష్ణమోహన్, ఆర్చరీ షూటింగ్ కోచ్ సుభాన్, పీడీలు నాగమణి, సాయి దావుద్, రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ సెక్రటరీ జి.సి.శేఖర్ రాజు , డిఎన్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.వర్గీస్ డేనియల్, పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏ టి ఏ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏ టి ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సరియం నాగేశ్వరరావు వసంతవాడ యుపిఎస్ పాఠశాలలో ముందుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలో 100 శాతం నియామకాలు, పదోన్నతులు సాధించడంలో ఏటిఏ ప్రధానపాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారము కొరకే కాకుండా గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై కూడా ఏటిఏ పని చేస్తుందన్నారు. బెంతు, ఒరియా, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తమ నిర్ణయంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇర్పా సూర్యచందర్, పూనెం సుందర్, కుంజా రాముడు, పాయం రమేష్, పొట్ట నవీన్, రాజు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కేరళ తరహాలో రాష్ట్రంలో సూపర్ మార్కెట్లు

విశాలాంధ్ర- తణుకు : కేరళ రాష్ట్రం తరహాలో రాష్ట్రంలో కూడా సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం తణుకులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ కేంద్రంతో పాటు మున్సిపాలిటీలో-1, మండలంలో-1 సూపర్ మార్కెట్లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ మార్కెట్ల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే సరుకులు విక్రయించడం జరుగుతుందన్నారు.తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి కూడా సబ్సిడీతో సరుకులను విక్రయిస్తామని తెలిపారు .

గతంలో మన రాష్ట్రంలో జయ బొండాలు రకం ధాన్యాన్ని ఇక్కడ రైతులు పండించే వారిని గుర్తు చేశారు. అయితే భారత ఆహార సంస్థ బియ్యన్ని కొనుగోలు చేయడం నిలిపివేయడంతో ఈ తరహా ధాన్యాన్ని మన రాష్ట్రంలో రైతులు పండించడం లేదన్నారు .కానీ ఈ రాష్ట్రంలో పండించిన ఈ రకం బియ్యం మంచి రుచి ఉండడంతో కేరళ వంటి కొన్ని రాష్ట్రాలు వీటిని కొనుగోలు చేయడం జరిగేదన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం జయబండాల రకం బియ్యాన్ని కావాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకోసం 50 శాతం అడ్వాన్స్ రూపంలో కూడా చెల్లిస్తామని అందుకు ఒప్పందానికి కేరళ రాష్ట్రం ముందుకొచ్చిందన్నారు. 60 వేల మెట్రిక్ టన్నులు కావాలని కోరడం జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు చేస్తామని వెల్లడించారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

విశాలాంధ్ర - తణుకు : పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తణుకు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీకారం చుట్టారు. తణుకు మండలం, దువ్వ గ్రామం, మెయిన్ రోడ్డు వాటర్ ట్యాంక్ వద్ద రూ. 38.59 కోట్లతో జలజీవన్ మిషన్ పైప్ లైన్, వాటర్ ట్యాంక్ మంచి నీటి అభివృద్ధి పనుల శంకుస్థాపన, దువ్వ గ్రామంలో డాక్టరు వైస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ ను, నూతన భవనం నందు రైతు భరోసా కేంద్రం, రైతు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రతి గ్రామానికి ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగు నీరు అందించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దువ్వ గ్రామానికి పైపు లైనుకు రూ.2 కోట్ల 15 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. దళారులు నుండి రైతులు మోసపోకుండా ధ్యానం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు అన్ని సేవలు ముగింట్లో అందించటమే ప్రథమ కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై డియం టి. శివరామ ప్రసాద్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు డి. మహేశ్వర రావు, వివిధ శాఖలు అధికారులు,గ్రామాల సర్పంచ్ లు , ప్రజా ప్రతినిధులు, రైతులు,మహిళలు, తది తరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

విశాలాంధ్ర- ఏలూరు : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో గమ్యస్థానాలకు చేర్చుతున్నామని ప్రజా రవాణా శాఖ విజయవాడ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు డిపో ను సందర్శించారు. అనంతరం జరిగిన జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా 80 వేల మంది ప్రయాణికుల్ని క్షేమంగా గమ్యం చేస్తున్నామన్నారు.2022- 23 సంవత్సరానికి 21,220 ఉచిత బస్సులు విద్యార్థిని, విద్యార్థులకు జారీ చేశామన్నారు.ఏలూరు జిల్లా నుండి శబరిమల కి 6 బస్సులు బుక్ చేశామన్నారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులకి పంచారామ క్షేత్రానికి 21 బస్సులను నడపడం జరిగిందన్నారు.ఇంకా రెండు వారాలు ఎంతో మంది భక్తులు దర్శనాలకి ఆర్టీసీ బస్సులను ఆదరిస్తున్నారు తెలియజేశారు .విద్యార్థుల సౌకర్యార్థం నూజివీడు నుండి రమణక్కపేట మీదుగా ధర్మాజీ గూడెం వరకు బస్సుని పునరుద్ధరణ చేయటం జరిగిందని, ప్రయాణికుల కోరి మేరకుఅశ్వరావుపేట నుండి జంగారెడ్డిగూడెం మీదుగా పోలవరం బస్సు ప్రారంభించామన్నారు. విద్యార్థుల, మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం ఏలూరు పాత బస్ స్టేషన్ నుండి వట్లూరు వరకు బస్సు ప్రారంభించారని తెలియజేశారు. జిల్లాకి 13 కొత్త హైర్ బస్సులను కేటాయించడం జరిగిందని ఆరు బస్సులు ఇప్పటికే నడుస్తున్నాయని మిగిలినవి ఒక వారం రోజుల్లో వస్తాయని తెలియజేశారు. ఔత్సాహిక వ్యాపారులకు ఏలూరు బస్టాండ్ నందు ఉన్న ఖాళీ స్థలం బిఓటి పద్ధతి పై ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి కలవారు టెండర్ లో పాల్గొనవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డి.పి.టి.వో ఏ వీరయ్య చౌదరి,ఏలూరు డిపో మేనేజర్ బి. వాణి,ఏ .టీ .ఎం కార్గో గిరిధర్ కుమార్,ఏవో వెంకటేశ్వరరావు,ఆర్ఎం ఆఫీస్ సూపరిండెంట్ ఎం. వేణుగోపాలరావు, పీ.ఆర్వో నరసింహం పాల్గొన్నారు .

అమరవీరులకు నివాళులు

విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రజా సమస్యల పోరాటంలో అమరులైన ఎందరో వీరులకు సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో బుధవారం వేలేరుపాడులో స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డివిజన్ నాయకులు సిరికొండ రామారావు, కట్ట ముత్యాలరావు అధ్యక్షత ఏర్పాటుచేసిన సమావేశంలో జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కన్వీనర్ ఎస్కే గౌస్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలపై పోరాడి ఎందరో ఆనాడు అమరులైనారన్నారు. ప్రజాతంత్ర విప్లవంతో సోషలిస్ట్ వ్యవస్థను ఏర్పాటు కొరకు పోరాడిన అమరవీరుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. మండలంలో అమరులైన తుర్ర ముత్యాలు, వడ్డీ రామారావు, కుంజ సుబ్బయ్య, కుంజ జోగయ్య, సోదే అర్జున్, సోదే ప్రసాదు, కట్టం దేశయ్య, సుబ్బయ్య, రవన్న, దొరన్న, ధర్మన్న, ఎల్లన్న, లింగన్న స్మరిస్తూ మౌనం పాటించి జోహార్లు అర్పించారు. ఎంతోమంది పోరాటాలు చేస్తేనే నేడు స్వేచ్ఛగా జీవించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత సమస్యలపై కూడా ఐక్యంగా పోరాల్సిన అవశ్యకత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డలు ముత్యాలరావు, పురేం. లక్ష్మయ్య, డివిజన్, మండల నాయకులు కట్టం వీరస్వామి, మేడేపల్లి,నార్లవరం సర్పంచులు కట్ట రాంబాబు, మడివి రంగమ్మ, ఉప సర్పంచులు బుచ్చయ్య, మోసం రాజారావు, ఎంపిటిసి రత్తమ్మ, కుంజా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర- దేవరపల్లి : దేవరపల్లి మండలం ఎర్నగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో సివి రామన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం సామాజిక విశ్లేషకులు సుంకవల్లి సత్తిరాజు బహుమతులు జ్ఞాపకలను అందజేశారు. మొదటి బహుమతి ఎం. కీర్తివర్షిని, రెండవ బహుమతి జి. రిషిత, పి. సింగ కావ్య, మూడవ బహుమతి టి. ధరణి, డి. ప్రియమణి ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను ప్రధాన ఉపాధ్యాయుని వాసవి, ఉపాధ్యాయులు జగదీష్ రాజు తదితరులు అభినందించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రాజమహేంద్రవరం అఖిల కంటి ఆస్పత్రి చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుల కేసి రాజు సీతారామయ్య, అధ్యక్షులు పప్పులు వెంకట రామారావు, బండి సూర్య ప్రకాష్ రావు, ఈదుపుగంటి నాగేశ్వరరావు, షేక్ వెంకటేశ్వర్లు, వై సత్యనారాయణ, ఆచంట జగన్నాథరావు, అకిరా కంటి ఆస్పత్రి విఆర్ఓ పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ

విశాలాంధ్ర- చాగల్లు: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలం చాగల్లులోని శ్రీ రాజ రాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో బుధవారం గ్రామంలోని అయ్యప్ప మాల ధారణ ధరించిన స్వాములు 300 మంది ఆలయ అర్చకులు శివకోటి శివ సీతారాం శర్మ అధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ తేటతుళ్ళ పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు.అనంతరం గ్రామం ప్రజలు సుఖ సంతోషంతో ఆరోగ్యం గా సుభిక్షంగా ఉండాలని కోరుచూ పుర వీధులో స్వాములు గ్రామోత్సవం జరిపారు. భక్తులు స్వాములను దర్శించుకొని ఆశీస్సులు పొందారు.

హమాలీ కాలనీ ప్రజలకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : కొమడవోలు హమాలీ కాలనీ ప్రజలకు, మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలనీ, అరాచక వ్యక్తుల నుండి కాపాడాలని కోరుతూ ఐ.ఎఫ్.టి.యు.అనుబంధ హమాలీ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో కొమడవోలు హమాలీ కాలనీలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తమ కాలనీలో సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ, రోడ్లు, డ్రైన్లు, కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలనీ, మహిళల రక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాలనీ ప్రజలకు మద్దతుగా కొమడవోలు స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మంగరాజు రాము అధ్యక్షతన జరిగిన సభలో కొమడోలు మాజీ ఎంపీటీసీ వీరంకి భాస్కర రావు, ఐ.ఎఫ్.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి యు వెంకటేశ్వరరావు,నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కాలనీ మహిళలు పల్లి పద్మ, చల్లా సావిత్రి, చల్లా వాణి, చిప్పాడ ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడారు. గత 20 సంవత్సరాల క్రితం హమాలీ కార్మికులు శ్రమతో ఏర్పాటు చేసుకున్న ఈ కాలనీలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. తమ కాలనీలోకి కొంతమంది అరాచక వ్యక్తులు ప్రవేశించి భయభ్రాంతులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క కాలనీలోని ఇద్దరు పురుష వాలంటీర్లు ఈ కాలనీ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని వారు తెలియజేశారు. ఆ వాలంటీర్లను కాలనీ నుంచి మరొక చోటకి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కాలనీ ప్రజలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. కాలనీ ప్రజలకు మద్దతుగా కొమడవోలు స్థానిక ప్రజలు యాదగిరి చినబాబు,మిడతా నటరాజ్,యార్లగడ్డ నాగరాజు,తాతా శ్రీనివాసరావు, యార్డ్ హమ్మాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, పల్లి గంగరాజు, సూరిబాబు, శ్రీను, రమణ, కృష్ణ, గంటా శ్రీను, రమేష్ స్థానిక కానీ ప్రజలు పల్లి శ్రీను, చల్లా బాలాజీ భారతి,మంగ,చిన్ని,చాందిని,జ్యోతి,క్రృష్ణవేణి తదితరులు నాయకత్వం వహించారు. ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని తెలియజేశారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యపడుతుందని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు విధిగా నమోదు చేసుకోవాలని పెద్దాపురం ఆర్డీవో జె సీతారామ రావు అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో బుధవారం తహసీల్దార్ అధ్యక్షతన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామారావు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు బలమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. నమోదు ఫారం 6 ప్రకారం మీ సేవా కేంద్రాల్లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పెద్దాపురం పలు పుర వీధుల గుండా నిర్వహించి ఓటు హక్కు ఆవశ్యకతపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాసిల్దార్ విజయ కుమారి, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఆర్ఐ వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ టి వీరయ్య చౌదరి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విస్తృతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాకియా

విశాలాంధ్ర - పెదపూడి : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియ విస్తృతంగా జరుగుతుందని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాకియా అన్నారు. జి మామిడాడ గ్రామంలో బుధవారం రైతు భరోసాకేంద్రాన్ని ఆమె సందర్శించి, పలు రికార్డులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవిధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయోమని పలు వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. ముందుగా మార్గ మధ్యలో పొలాలు వద్ద ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలాకియా మాట్లాడుతూ రాష్ట్ర -ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి రైతులు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించడంతో పాటు మద్దతు ధర పొందవచ్చన్నారు. ప్రధానంగా కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అవసరమైన గోనే సంచులు. రవాణా హమాలీలు మొదలగు ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో రైతు భరోసాకేంద్రాల నుంచి ధాన్యాన్ని విక్రియంచుకోవాలని రైతులకు సూచించారు. ఏ విధంగానైన మధ్యవర్తులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులకు సహాయంగా వ్యవసాయ సహాయకులు సాంకేతిక వలంటీర్లు, నియమించామన్నారు. వీరి నుంచి కనీస మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోలుకు మండల స్థాయిలో తహసీల్దార్. ఎంపీడీఓ, వ్యవసాయశాఖాధికారితో కలిపి ఒక బృందం. ఏర్పాటు చేశారన్నారు..ఆయన వెంట కాకినాడ ఆర్డీఓ బివి రమణ, తహసీల్దార్ టి సుబాష్ ఎంపీటీసీ సుభ్యురాలు కర్రె వెంకటపద్మావతి, ఉప సర్పంచి మేడపాటి తారారెడ్డి, సిబ్బంది. పాల్గొన్నారు.

ఇంటింటికి మంచినీటినందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఇంటింటికి మంచినీటినందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగానే జలజీవన్ మిషన్ పథకం ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకురావడం జరిగిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం పెద్దాపురం మండలం జి రాగంపేట గ్రామంలో 46 లక్షల రూపాయలతో చేపట్టే జలజీవన్ మిషన్ ఇంటింటికి కులాయి పనులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. తాగునీటికీ ప్రాధాన్యతనిచ్చి గ్రామీణ ప్రాంతాల్లో జల జీవన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు .ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తాగు నీటిని వృధా చేయకుండా ఇంటింటికి కులాయి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ చైర్మన్ బందారు వీరబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కంటే వీర రాఘవరావు, ఎంపీటీసీ కాదా అనురాధ, ఆర్డబ్ల్యుఎస్ జెఇ అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, వైసీపీ నాయకులు నరాలశెట్టి బాబ్జీరావు, నల్లల గోవిందు, బర్రె రామగోవిందు, ఎంపీటీసీ భద్రరావు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం కోటి, టిడిపి నాయకులు బొద్దు వెంకన్న, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బస్తీసంపర్క్ అభియాన్

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక రేచర్లపేట ప్రాంతంలో బుధవారం భారతీయ జనతపార్టీ అధ్వర్యంలో బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సభల నిర్వహణలో భాగంగా జరిగిన కార్యక్రమంలో నిరుపేద మహిళలకు దుప్పట్లు పంపిణీచేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్, ఎస్సీమోర్చా అధ్యక్షుడు జి. దేవానందం, కాకినాడజిల్లా దళిత అధ్యక్షుడు కొంద్రు నతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీరాణి, ఎగ్జిక్యుటివ్ మెంబర్ చెరియన్, ఏడిద కృష్ణతోపాటు ముత్తా నవీన్, గట్టి సత్యనారాయణ, వై.మాలకొండయ్య, పైడా వెంకటనారాయణ, చెక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మధ్యాహ్న భోజనం అందజేత

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వా సుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ట్రస్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వరుపుల రాజా ఆదేశాలతో ప్రతి నెల 9వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడకుండా మధ్యాహ్నం భోజనాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సూతి బూరయ్య, వెలగల సూర్య ప్రతాపరెడ్డి, ఆసుపత్రి ఇంచార్జ్ మెడికల్ ఆఫీసర్ జి శైలజ, మండల తెలుగుదేశం నాయకులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - కాళ్ళ : కోమటిగుంట గ్రామానికి చెందిన తూము.శ్రీనివాసరావు (34)స కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

సీసలి గ్రామ సమీపంలోని మేకల దిబ్బ గ్రామంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని,అతని సోదరుడు గంగ మోహన్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాళ్ళ ఎస్.ఐ. తెలియజేసారు.